# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 16, అక్టోబర్ 2025


## నేలకొరిగిన పంటలు



☆ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం

☆ అన్నదాత ఆశలు ఆవిరి..

సిరికొండ, అక్టోబర్ 15, ప్రభాతవార్త

మండలంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పలు రైతులు, కౌలు రైతులకు చెందిన వరి, సోయా, మొక్కజొన్న తది తర పంటలు నేలకొరిగాయి. చేతికొచ్చిన పంటలు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నేల కొరగ డంతో పంట పాడైపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గింజలయ్యే మిగతా 2లో..

### వరి ధాన్యం సేకరణ ప్రక్రియ

## పకడ్బందీగా నిర్వహించాలి

● రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నస్పూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

2025-26 ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం సేకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌరసరఫరాలు, వ్యవసాయ, రవాణా, ఎఫ్‌సిఐ శాఖల కమిషనర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ మిగతా 2లో..



## మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు యువతకు ఆహ్వానం

✪ వాహన నియమ నిబంధనలు పాటించేలా చర్యలు

✪ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అచల్ మహాజన్



బజార్‌హత్నూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

ఆదిలాబాద్ జిల్లాలో నిరుపేద యువతీ, యువకులు, ప్రజలు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వాహన నియమ నిబంధనలు పాటించడానికి ప్రత్యేకంగా జిల్లా పోలీసు యంత్రాంగం తరపున మొదటి విడత 5 మండలాలలో మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భంగా 5 మండలాలు నార్నూర్, గాదిగూడ, బజార్ హత్నూర్, సిరికొండ, బీంపూర్‌లలో యువత, ప్రజలు తమ యొక్క ఆధార్ కార్డు, అడ్రస్ ప్రూఫ్ లేదా టెన్త్ క్లాస్ మెమో జిరాక్సులను సంబంధిత పోలీసు స్టేషన్‌ల నందు అందించి రిజిస్ట్రేషన్ మిగతా 2లో..

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

★ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ఆసిఫాబాద్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

జిల్లాలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అంకుశపూర్ గ్రామంలో పశు వైద్య ఉపకేంద్రంలో పశు వైద్య, పశుసంపర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమానికి అధికారులతో కలిసి హాజరై పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిగతా 2లో..

## బీద కుటుంబానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేయూత

❊ 20 సంవత్సరాల పాటు ప్రతీ నెల రూ. 2500 అందజేత

❊ మాట ఇచ్చి నిలబెట్టుకున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ మారుమూల గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేయూతనం దించేందుకు ముందుకు వచ్చారు. మండలంలోని చిన్నమాలిని గ్రామానికి చెందిన కోర్రం శ్రీదేవి అనే గర్భిణి స్త్రీ వైద్యం కోసం హాస్పిటల్ వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేని కారణంగా మార్గమధ్యలోనే కుమారునికి జన్మనిచ్చి పురిటి నొప్పులు భరించలేక మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హుటాహుటిన ఆరోజు గ్రామానికి వెళ్లి కుటుంబ పరిస్థితులను గమనించి పుట్టినటువంటి కుమారునికి చదువుల కోసం, కుటుంబ అవసరాల కోసం ప్రతి నెల ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అభయ హస్తంగా నెలకు 2500 రూపాయలు 20 సంవత్సరాల వరకు మిగతా 2లో..



## దహెగాంలో పెద్దపులి సంచారం

● భయాందోళనలో గ్రామాల్లోని ప్రజలు

దహెగాం, ప్రభాతవార్త



దహెగాం మండలంలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. ఎర్రవాగు సమీపంలో ని తంగళ్లపెల్లి, చిన్న తిమ్మాపూర్ గ్రామాల పంట పొలాల్లో పులి అడుగులను బుధవారం గమ నించినట్టు పంట పొలానికి వెళ్లిన రైతులు తెలిపారు. రైతులు, గ్రామస్థులు భయబ్రాంతులకు గురై అటవీ అధికారులకు సమాచారం అందించారు. కాగజ్‌నగర్ అటవీ విభాగ అధికారులు పులి కదలికలను గమనిస్తూ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హేచ్చరించారు. రెండు రోజుల క్రితం పెద్దవాగు దాటి బీబ్రా, పెసరికుంట గ్రామాల పంట పొలాల నుంచి చిన్నగూడిపేట మిగతా 2లో..

### రుణాలను సకాలంలో

## సద్వినియోగం చేసుకోవాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి సిఈఓ సూర్యప్రకాష్

ఆసిఫాబాద్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

జిల్లా సహకార బ్యాంక్ ద్వారా అందించే రుణాలను రైతులు,వ్యాపారస్థులు సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని సహకార బ్యాంక్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి సిఈఓ సూర్యప్రకాష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సహకార బ్యాంక్‌లో జిల్లాలోని సహకార బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌లతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని రుణాలు అందించారు, ఎంత రికవరి చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న రుణాలను త్వరగా రికవరి చేయాలన్నారు. అనంతరం విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిగతా 2లో..



## నేలకొరిగిన పంటలు

(మొదటిపేజీ తరువాయి)

సమయంలోనే వర్షాలు అధికంగా ఉండటం, అనుకూల వాతావరణ పరిస్థితులు లేకపోవడంతో ఇప్పటికే గింజలు సన్నబడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేవిధంగా వర్షాలు కురిస్తే కాయలన్నీ రాలి నేలపాలు అవుతాయని అంటున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, చేతికి వచ్చిన పంట కళ్ల ముందే పాడైపోతున్నది. గంపెడాశలతో సాగుచేసిన పంట నష్టాలపాలు చేస్తోందని, పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాకపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు యువతకు ఆహ్వానం

(మొదటిపేజీ తరువాయి)

చేసుకోవాలని సూచించారు. వీరూ మొదటగా ఆన్లైన్ నందు లేదా. మీసేవ కేంద్రాల్లో లర్నింగ్ లైసెన్స్‌కై 600 రూపాయల రుసుము చెల్లించవలసిందిగా ఉంటుందని, తదుపరి లర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ వచ్చిన తర్వాత నెల రోజుల నుండి ఆరు నెలల లోపు పర్మినెంట్ లైసెన్స్ కొరకు 1200 రూపాయల రుసుమును ప్రభుత్వానికి చెల్లించవలసింది ఉంటుందని తెలియజేశారు. ఈ మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళాను ప్రజలు, యువత పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈనెల 18వ తారీకు వరకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యువత ప్రజలు వాహన నియమనిబంధనలు పాటించాలని ప్రమాదాలకు గురి కాకుండా లైసెన్సులు నియమాలు ఉపయోగపడతాయని సూచించారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం అధిక వర్షాలు కురిసినందున పశువులు వ్యాధులకు గురయ్యాయని, గాలికుంటు వ్యాధి అంటూవ్యాధి లాంటిదని, ప్రతి ఒక్కరూ తమ పశువులకు టీకాలు వేయించాలని తెలిపారు. పశువుల యజమానులు తమ పశు వైద్యాధికారుల చరవాణి నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం యజమానులకు పశువులకు బలాన్ని అందించే మల్టీ మిక్స్ పౌడర్ ప్యాకెట్లను అందజేశారు. జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సురేష్ కుమార్, వైద్యులు, పశువుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

### రుణాలను సకాలంలో
## సద్వినియోగం చేసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంక్ ద్వారా రైతులకు పంట, మాటిగేజ్, వ్యవసాయ పరికరాలకు రుణాలు అందిస్తామని, వ్యాపార, హోసింగ్, ఎడ్యుకేషన్ రుణాలను కూడా అందిస్తామని అన్నారు. అవసరం ఉన్న వారు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సరైన సమయంలో రుణాలు చెల్లించినట్లయితే వారికి రుణాలు మరి కొంత పెంచి అందిస్తామని భరోసా కల్పించారు. అనంతరం ఆసిఫాబాద్ జిల్లా ప్యాక్స్ చైర్మన్ అలీ బిన్ అహ్మద్, సిబ్బందితో కలిసి ఆయనకు శాలువా కప్పి సన్మానం చేశారు. వీరి వెంట జిల్లాలోని అన్ని సహకార బ్యాంక్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## దహెగాంలో పెద్దపులి సంచారం

(మొదటిపేజీ తరువాయి)

గ్రామ పొలాల వైపు వెళ్లినట్టు అటవీ అధికారులు తెలిపారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూస్తామని ప్రజలు ఒంటరిగా పంట పొలాలకు వెళ్ళవద్దని అటవీ అధికారులు తెలిపారు.

## బీద కుటుంబానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేయూత

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మాటను నిలబెట్టుకుంటూ ఆ కుటుంబానికి బుధవారం ఈనెల 2500 రూపాయలు వారి ఎకౌంట్లో జమ చేయడం జరిగింది. ఇదే విధంగా ప్రతినెల 2500రూ, ఆమె కుటుంబానికి చెందుతాయని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. 2500 రూపాయలు జమచేసిన బ్యాంకు పాస్ బుక్‌ను బీఆర్ఎస్ నాయకులు బండి వాసు, తన్నీరు పోచంలు అందజేశారు.

### వరి ధాన్యం సేకరణ ప్రక్రియ
# పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకార, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ, రవాణా, పోలీస్ శాఖల అధికారులతో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ 2025 26 సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన ఏర్పాటు చేయాలని తెలిపారు. వానాకాలంలో 66 లక్షల 80 వేల ఎకరాలలో ప్రతిపాదిత వరి సాగు జరిగిందని, దాదాపు 148 లక్షల మెట్రిక్ టన్నుల వంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని, 80 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర, సన్న రకం వడ్ల బోనస్, కొనుగోలు కేంద్రాల వివరాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే సమయంలో లోతట్టు ప్రాంతాలలో ఉండకుండా చూసుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో త్రాగునీరు, నీడ ఇతర కనీస వసతులు కల్పించాలని, అవసరమైన గన్ని సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, సరిపడా హమాలీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సన్నరకం, దొడ్డు రకం వరి ధాన్యాలను వేరువేరుగా కొనుగోలు చేసి నిబంధనల ప్రకారం వేరు వేరు గన్నీ సంచులలో సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. ప్యాడి క్లీనర్లు, తేమ శాతం పరికరాలు, హస్క్ రిమూవర్‌లు, తూకం యంత్రాలను అందుబాటులో ఉంచాలని, తూనికలు కొలతల శాఖ అధికారులతో ధ్రువీకరించుకోవాలని తెలిపారు. వరి ధాన్యం తరలింపుకు అవసరమైన గన్నీ సంచులు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారుల ఆధ్వర్యంలో హార్వెస్టర్ వాహనంలో బ్లోయర్ యాక్టివ్ మోడ్‌లో ఉండి ఆర్.పి.ఎం. 18 20 ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్ల నుండి సి.ఎం.ఆర్.కు సంబంధించిన బ్యాంకు గ్యారంటీలు, ఒప్పందాలు సిద్ధం చేసుకోవాలని, కలెక్టరేట్ భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రైతులకు కొనుగోలు సమయంలో తలెత్తే ఇబ్బందులపై ఫిర్యాదులు స్వీకరించాలని, హెల్ప్ లైన్ నెంబర్‌ను ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్రదర్శించాలని తెలిపారు. వాతావరణ సూచనలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలకు దాన్యం తడవకుండా టార్పాలిన్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయంతో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలకు వెంటనే స్పందించాలని, రిజైండర్లు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా అన్ని శాఖల సహకారంతో వరి ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడం జరుగుతుందని, కనీస మద్దతు ధర చెల్లించి రైతులకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని, గన్ని సంచులు, టార్పాలిన్లు, రవాణా తదితర సౌకర్యాలు కల్పించాలని, పత్తి, మొక్కజొన్న, సోయా సాగు చేసిన రైతులకు కూడా కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల మేరకు దాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కనీస మౌలిక వసతులు కల్పించడంతో పాటు నిర్ణీత వ్యవధిలో చెల్లింపులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గాలికుంటు టీకాలు... పశువులకు రక్షణ కవచం

**- పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలి**

**- పశువైద్య అధికారి డాక్టర్ రాకేష్**

పెంచికల్‌పేట్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం ద్వారా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువుల్లో వేయబడే ఉచిత గాలికుంటు టీకాల కార్యక్రమం ప్రారంభం అయిందని మండల పశువైద్య అధికారి డాక్టర్ రాకేష్ తెలిపారు. కార్యక్రమములో భాగంగా బుధవారం తొలి రోజు పెంచికల్ పేట్ గ్రామ పంచాయతీలో మూడు నుండి నాలుగు నెలల వయసు పైబడిన 142 పశువులకు, 99 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ పశువులు గేదెలలో రోగనిరోధక శక్తి, పాల ఉత్పత్తి మెరుగుపడటంతో పాటు వాటి ఆరోగ్యం కాపాడుకోవడానికి ప్రతి రైతు తప్పనిసరిగా తమ పశువులు, గేదెలకు టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు వేయించకపోతే వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమం నవంబర్ నెల 15 వరకు నెల రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమములో పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విధులకు హాజరు కావాలి

**- ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా**

ఆసిఫాబాద్, అక్టోబర్ 15, ప్రభాతవార్త



విద్యార్థుల సంక్షేమం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విధులకు హాజరు కావాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ వసతి గృహాలలో పార్ట్ టైం, దినసరి వేతనంతో పని చేస్తున్న 220 మంది సమ్మెలో పాల్గొన్న నేపథ్యంలో వారి 3 నెలల వేతనాన్ని వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. దసరా సెలవుల అనంతరం ఈ నెల 4వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అయినందున సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో విద్యార్థులకు వంట, పరిశుభ్రత, విద్యార్థుల సంక్షేమ దృష్ట్యా తాత్కాలికంగా బయట వ్యక్తులు పని చేయడం జరుగుతుందని తెలిపారు. కొంతమంది కార్మికులకు తమ జీతాలు చెల్లించిన తర్వాత కూడా ముందస్తు అనుమతి లేకుండా, ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం అందించకుండా సమ్మెలో కొనసాగుతున్నారని, సిబ్బంది విధుల నుండి తొలగింపబడలేదని, ముందస్తు అనుమతి తీసుకోకుండా విధులలోకి అనుమతించవద్దని మాత్రమే తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలలోని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నందున విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అనుమతి తీసుకుని విధులకు హాజరు కావాలని తెలిపారు.

# ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

**- రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

2025-26 ఖరీఫ్ సీజన్కు వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని సచివాలయం నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌరసరఫరాలు, వ్యవసాయ, రవాణా, ఎఫ్సిఐ శాఖల కమిషనర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో పాటు పలు శాఖల అధికారులతో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్ లో 44 వేల మెట్రిక్ టన్నుల వరిదాన్ని దిగుబడి వచ్చే అవకాశం ఉందని, జిల్లాలో 40 కొనుగోలు కేంద్రాలు (ఐకెపి ఆధ్వర్యంలో 22, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 18) ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 24వ తేదీలోగా అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దాదాపు 30 వేల మెట్రిక్ టన్నులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు 2389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2369 రూపాయలు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. హార్వెస్టర్ వాహనాల యజమానులతో సమావేశం నిర్వహించి, వ్యవసాయ శాఖ, కేంద్రాల నిర్వహకులకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో వరి కొనుగోలు కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తరావు, పౌరసరఫరాల శాఖ అధికారులు స్వామి, సాదిక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.








## ఉద్యాన పంటలు సందర్శించిన జిల్లా ఉద్యాన శాఖ అధికారులు

**లక్షెట్టిపేట, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలంలోని సూరారం గ్రామంలో రైతులు సాగుచేస్తున్న కూరగాయలు తోటలు, పండ్ల తోటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారులు కె.అనిత, కె. సహజ సందర్శించారు. వంకాయ, గులాబీ, మల్లె పంటలపై క్షేత్రాన్ని సందర్శించి పంటలో వచ్చే మెలకువలు, సస్యరక్షణ తోటల్లో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై ఉద్యాన శాఖ అధికారినీ కె. సహజ రైతులు వివిధ కూరగాయల్లో చీడపీడల్లో సస్యరక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచిర్యాల జిల్లా ఉద్యాన పంటల్లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీల వివరాలను రైతులకు వివరించి చెప్పారు. ఉద్యాన విస్తరణ అధికారి ఆడెపు శేఖర్, రైతులు రాజు, మల్లేష్, హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.



## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**వేమనపల్లి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

పశువుల పెంపకదారులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలని మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పవన్, డాక్టర్ సుప్రియ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని మంగనపల్లి గ్రామంలో 300 పశువులకు టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ వారీగా అన్ని గ్రామాల్లో టీకాలు వేయడం జరుగుతుందని, కావున పశుపోషకులు అందరూ పశువైద్య సిబ్బంది మీ గ్రామానికి వచ్చినప్పుడు సహకరించి మీ పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు తప్పకుండా వేయించుకోవాలని అన్నారు. గురువారం బొమ్మన, మామిడిపల్లి గ్రామాల్లో పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని, అందుకుగాను రైతులు తమ పశువులను ఇంటి వద్ద ఉంచాలని సూచించారు. వీరితో పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.



## నేషనల్ స్థాయి బాక్సింగ్ పోటీలకు కాగజ్‌నగర్ విద్యార్థుల ఎంపిక

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

హైదరాబాద్‌లో జరిగిన డిఎవి రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో కాగజ్‌నగర్ ఏడీవి లక్ష్మిపత్ సింగానియా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పూర్వా, జి రవిచందర్, వంగారి నితిక్ష అద్భుతమైన ప్రతిభ కనబరిచి నేషనల్ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైయ్యారు. అండర్ -14 బాలికల విభాగంలో 32-34 కిలోల, 48-50 కిలోల బరువు కేటగిరిలలో పోటీపడి విజయసం సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి నేషనల్స్‌కు ఎంపికైన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్రీడా విభాగం ఇన్‌చార్జ్, అధ్యాపకులు అభినందించి వారి ప్రతిభకను ప్రశంసించారు.

## తల్లులు, చిన్నారుల ఆరోగ్యం కోసం సమతుల్య ఆహారం ఎంతో కీలకం

**- అంగన్వాడీ సూపర్‌వైజర్ రమాదేవి**

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

తల్లులు, చిన్నారుల ఆరోగ్యం కోసం సమతుల్య ఆహారం ఎంతో కీలకమని అంగన్వాడీ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని రామమందిర్ సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ రమాదేవి మాట్లాడుతూ గర్భిణీలు పుష్కల పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అలాగే చిన్నారులలో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. అనంతరం పిల్లలతో పాట, ఆటలతో కార్యక్రమం సందడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, పిల్లలు, కిషోర బాలికలు, గర్భిణీలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎస్పీయంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి

**- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు**

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కార్మిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్‌కు విన్నవించారు. బుధవారం హైదరాబాద్ సచివాలయంలో కార్మిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ మరియు లేబర్ కమిషనర్ దాన కిషోర్‌ను మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కలిశారు. చాలా కాలంగా సిర్పూర్ పేపర్ మిల్లులో ఎన్నికలు జరగక పోవడంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలో వెంటనే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపాల్ సెక్రటరీ తగు ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## మహాత్మ జ్యోతిబాపూలే విద్యాలయంలో షీటీంపై అవగాహన

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



కాగజ్‌నగర్‌లోని మహాత్మ జ్యోతిబా ఫూలే విద్యాలయంలో మహిళల భద్రతపై షీ టీం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్‌చార్జి ఏఎస్ఐ సునీత మాట్లాడుతూ విద్యార్థినులకు భద్రతా చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, డయల్ 100 వినియోగం, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు, ఈవ్ టీసింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఎవరైనా వేధింపులకు గురైనప్పుడు వెంటనే కాగజ్‌నగర్ షీ టీమ్ నంబర్ 8712670565కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వై. జయప్రద, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు బి. రమాదేవి, శ్రీనివాస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్**

**దహెగాం, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. దహెగాం మండలంలోని ఖర్జీలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ దహెగాం, కన్నెపల్లి జట్ల మధ్య పోరు జరిగిందని దహెగాం జట్టు మొదటి బహుమతి సాధించగా, కన్నెపల్లి జట్టుకు రెండవ బహుమతి సాధించాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు మధుకర్, తిరుపతి, సంజీవ్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో దహెగాం మాజీ జడ్పిటీసి రామారావు, మండల అధ్యక్షులు భీమన్న, ఖర్జీ మాజీ సర్పంచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించండి

**- బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ డిమాండ్**

**బెల్లంపల్లి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మందమర్రి జనరల్ మేనేజర్ రాధాకృష్ణకు వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ నాయకులు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో 1928 వ సంవత్సరంలో బొగ్గు గనులు ప్రారంభించడం జరిగింది. బెల్లంపల్లి పట్టణంలో అనేక బొగ్గు గనులతో కార్మిక బస్తీలతో నిండు పున్నమి చంద్రుల పట్నం వికసించేదని సింగరేణి కంపెనీకి 80 సంవత్సరాలుగా సిరులు అందించిన బెల్లంపల్లి పట్టణంలో బజార్ ఏరియాకు సౌత్ కలాస్కట్ బొగ్గు గని నడిపించిందని ఈ గణికి ఆనుకొని క్యాంటీన్ ఎస్ఎంపి ఆఫీస్, కోల్ శాంపిల్ఆఫీస్, సివిల్ డిపార్ట్మెంట్, ల్యాంప్ క్యాబిన్ కార్యాలయం కూడా ఉండేవి అని కన్యకా పరమేశ్వరి దేవాలయము, పద్మశాలి ఫంక్షన్ హాలు స్థలంలో సివిల్ డిపార్ట్మెంట్ కాంట్రాక్టు క్యాజువల్ వర్కర్స్ ను డిస్ట్రిబ్యూషన్ చేసే ఆఫీస్ మరియు సిమెంట్ పోల్స్ సిమెంట్ ఇటుకలు ఈ స్థలంలో తయారు చేసే వారనీ, సింగరేణి అధికారులు గతంలో పనిచేసిన వారు ఇట్టి స్థలాన్ని రెండు దేవాలయాలకు ఇవ్వడం జరిగిందని, పద్మశాలి భవన్ లో ఇప్పటికీ సింగరేణి యాజమాన్యం ఇచ్చిన స్థలం కాంపౌండ్ వాల్ లోపల ఇంకా ఖాళీ స్థలం ఉన్నప్పటికీ కాంపౌండ్ అవతలి స్థలాన్ని దురుద్దేశంతో కబ్జా చేసే గురించి కాంపౌండ్ వాల్ అవతల దేవుని విగ్రహాలు పెట్టి దేవుని పేరిట పూజలు చేయడం అంటేనే ఖాళీ స్థలాన్ని కబ్జా చేయడం సమంజసంగా లేదని మసీదుకు ఇచ్చిన స్థలం కాకుండా పక్కన ఉన్న స్థలాన్ని కబ్జా చేస్తు నిర్మాణం చేస్తున్నారని ఇది కూడా సమంజసంగ లేదని ఈ విషయంలో సింగరేణి యాజమాన్యం సింగరేణి అధికారులు వాస్తవ పరుస్తున్న అర్థం చేసుకొని ఎమ్మెల్యే వినోద్.. పై వాస్తవాలను అర్థం చేసుకొని వాటి స్థలాన్ని కాలీ చేయించడానికి సింగరేణి యాజమాన్యానికి సహకరించాలి తప్ప కబ్జాదారును ప్రోత్సహించడం ఏమాత్రం భావ్యం కాదని, సీ అండ్ ఎండి సింగరేణి వాస్తవాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే కొన్ని సంవత్సరాల క్రితం ఉత్పత్తి ఉత్పాదకత అవసరాల రీత్యా ఏర్పాటు చేసిన ఎక్స్ప్లోరేషన్, డివిజన్ ఆఫీస్, ఏజెంటు ఆఫీస్, వర్క్ షాప్, పవరాజ్, ఓల్డ్ సీఎస్పీ, మహమ్మద్ హుస్సేన్ సెట్ టింబర్ యార్డ్, ఓల్డ్ జిఎం ఆఫీస్, టింబర్ డిపార్ట్మెంట్ ఆఫీసులో ఉన్నవి. ఈ భూములను కాపాడాలని సింగరేణి ఉన్నత యాజమాన్యానికి బెల్లంపల్లి ప్రాంతంలో ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రజలకు ఇట్టి భూములను సింగరేణి స్థలాలను కబ్జా కోరుల నుండి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. పద్మశాలి భవన్ ముందు నిర్మించిన అక్రమ కట్టడాలను, మసీదు పేరుతో ఆనుకొని ఉన్న స్థలాన్ని కబ్జా చేయడం నిలిపివేయాలని కోరుతున్నాం. పద్మశాలి భవన్ కాంపౌండ్ వాల్కు నిర్మించిన రెండు గేట్లను తొలగించి అట్టి స్థలంలో గోడలు నిర్మించాలని కబ్జాకు గురవుతున్న స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించగలరని సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ సభ్యులు చిప్ప నరసయ్య సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, దాగాం మల్లేష్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆడెపు రాజమోళి సిపిఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి, బొల్లం తిలక్ అంబేద్కర్ సిపిఐ బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి, సబ్బని రాజేంద్రప్రసాద్ ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి, గెల్లి రాయలింగు కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్, గెల్లి జయరాం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎండి అఫ్జల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, రత్నంరాజం, దేవసాని ఆనంద్, ఆడెపు మహేష్, పసులేటి వెంకటేష్ ఎంసీపీఐయ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.






## మందమర్రి కేకే ఓసి స్టోర్‌లో దొంగతనానికి ప్రయత్నించిన దొంగలు

**మందమర్రి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



మందమర్రి కేకే ఓసి స్టోర్ దగ్గర దొంగతనానికి యత్నించిన ముగ్గురు దొంగలు. ఇది గమనించిన ఎం.టి.ఎఫ్ సెక్యూరిటీ గార్డ్ పి.సదానందం ఫోన్ చేసి సంబంధిత అధికారులకు తెలుపగా ఏంటీఎఫ్ టీం అక్కడికి వెళ్లి స్టోర్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో వెతకగా యార్డ్ లోపల దొంగతనానికి వచ్చిన ఇద్దరు దొంగలను పట్టుకోగా, ఒకరు పారిపోయారు. తదనంతరం దొంగలను ఎస్ అండ్ పిసి కంట్రోల్ రూమ్‌లో ఉంచారు. దొంగతనానికి వచ్చిన దొంగలు ఇద్దరిని బుధవారం మందమర్రి పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ అండ్ పిసి సిబ్బంది, ఎం.టి.ఎఫ్ సిబ్బందిని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అభినందించారు.

## ప్రతి పంటపై క్షేత్ర ప్రదర్శన

**కెరమెరి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

అంకుష్ వారి అనీష్ బిజీ రెండవ రకం పత్తి విత్తనాలు నాణ్యమైనవి అని ఆ కంపెనీ జనరల్ మేనేజర్ గోవింద్ స్వామి అన్నారు. బుధవారం మండలంలోని రమేష్ అనే రైతు పత్తి పొలంలో పత్తి పంటపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. మాట్లాడుతూ ఈ రకం అన్ని రకాలైన నేలలకు అనుకూలం అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకొని రైతులకు అధిక దిగుబడులను ఇస్తుంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితులలో కూడా తట్టుకొని ప్రతి మొక్కకి 80 నుంచి 90 కాయలు ఉండి ఆరోగ్యకరంగా పొలము ఉంది. కావున రైతులందరూ కూడా ఇలాంటి విత్తనాలను తమ పొలంలో నాటుకొని అధిక దిగుబడులను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ రీజినల్ మేనేజర్ హరివర్మ ఏరియా మేనేజర్ గంగయ్య డిస్ట్రిబ్యూటర్ అయ్యప్ప ట్రేడర్స్ రామకృష్ణ, స్వామి, సుధాకర్, కంపెనీ ప్రతినిధులు సత్యం, తిరుపతి, రఘు, రవి, శ్రీకాంత్, వివిధ గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మహిళల భద్రత కోసమే షీ టీం

**కెరమెరి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



మహిళల భద్రత కోసమే షీ టీం అందుబాటులో ఉందని ఎస్ఐ మధుకర్, షీ టీం ఇన్చార్జ్ ఎస్ఐ బిక్కొలాల్ అన్నారు. బుధవారం మండలంలోని మోడీ కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో షీ టీం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా, వేధింపులు, చీటింగ్, సైబర్ మోసాలు, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలు జరిగితే డయల్ 100 లేదా షీ టీం హెల్ప్‌లైన్ నంబర్ 87126 70564కు వెంటనే సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం షీ టీం అందుబాటులో ఉందని, ప్రతి మహిళా భద్రతను పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటుందని తెలిపారు. షీ టీం మహిళా సురక్షణ కోసం పాఠశాలలు, కళాశాలలు, బస్ స్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో పర్యవేక్షణ చేస్తుందని, ఎవరైనా వేధింపులకు గురైతే పోలీసులను సంప్రదించాలని చెప్పారు. ప్రతి విద్యార్థిని తమ హక్కులు టీం సభ్యులు స్వప్న, రజిని, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరు సీపీఆర్ పై అవగాహన ఉండాలి

**వేమనపల్లి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు సీపీఆర్ పై అవగాహన కలిగి ఉండాలని వైద్యుడు అన్వేష్ పేర్కొన్నారు. సీపీఆర్ పై అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం వైద్యుడు రాజేష్ ఆదేశాల మేరకు దాస్నాపూర్ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సీపీఆర్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యుడు అన్వేష్ మాట్లాడుతూ... ఈ రోజుల్లో వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు సంభవిస్తోందన్నారు. ఆహార అలవాట్లు, శరీరానికి వ్యాయాయం లేకపోవడం కారణంగా హార్ట్‌ఎటాక్ వచ్చే అవకాశాలున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గుండెపోటు సంభవిస్తే సీపీఆర్ ద్వారా ప్రథమ చికిత్స చేస్తే బాధితుడిని కాపాడుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే పొగాకు, గుట్కా, సిగరెట్ మత్తు పదార్థాలు వాడకం వలన వచ్చే వ్యాధుల గురించి కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఆపరంజి, హెచ్ఎం మాధవ్, వైస్ హెచ్ఎం జ్ఞానేశ్వర్, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, రాజ్యలక్ష్మి, సునీత ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పత్తి పంటను ధ్వంసం చేసిన అడవి పందులు

**కెరమెరి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

నేల తల్లిని నమ్ముకుని అతివృష్టి, అనావృష్టిని తట్టుకొని పంట చేతికి వస్తదో రాదో తెలియకపోయినా విత్తనాలు నాటి ఆరుగాలలు శ్రమించి తీరా పంట చేతికచే సమయంలో అడవి పందుల దాడిలో పత్తి పంట ధ్వంసం అయినా సంఘటన కెరమెరి మండలం చోటుచేసుకుంది. మండలంలోని కేళి బి గ్రామానికి చెందిన సయ్యద్ లాలు అనే రైతు సుమారు రెండు ఎకరాల పత్తి పంటను మంగళవారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. ముందే తీవ్ర వర్షాల వల్ల పంట దిగుబడి తగ్గడంతో పాటు పంట చేతికి రావడం ఆలస్యమైందని, అప్పు తెచ్చి పంట వేశానని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసం అయిన పంటకు సంబంధిత అధికారులు నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.

## ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంజేపి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుకన్య అన్నారు. బుధవారం గురుకుల పాఠశాల విద్యార్థులకు బెడ్ షీట్, ప్లేట్స్, గ్లాసులతో కూడిన కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థానానికి ఎదిగేలా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకులం పాఠశాల ఉపాధ్యాయురాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో జిల్లాలోని పశువులకు టీకాలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, ఇతర అధికారులతో కలిసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల సంబంధిత గోడ ప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుండి నవంబర్ 14వ తేదీ వరకు ప్రతి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించడం జరుగుతుందని, 4 నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకాలు అందించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశు సంరక్షణలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, 2 లక్షల 42 వేల పశువులకు టీకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు జిల్లాలో 35 బృందాల ద్వారా 94 మంది పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు టీకాలను అందిస్తారని తెలిపారు. వ్యాధి కారణంగా పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని, పునరుత్పత్తి, పని సామర్థ్యం తగ్గడంతో పాడి రైతులకు నష్టం జరుగుతుందని, దీనిని నివారించేందుకు ప్రతి పశువుకు టీకాలు అందించాలని తెలిపారు. టీకాలు వేసిన ప్రతి పశువుకు గుర్తింపు చెవిపోగు వేసి వివరాలను భారత్ పశుధాన్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. గ్రామ పెద్దలు, రైతులు తమ పశువులకు టీకాలు వేయించి వాటి సంరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా విక్రయించే వారు ఎన్‌ఓసి తీసుకోవాలి

### - మున్సిపల్ చైర్మన్ గజానంద్

ఆసిఫాబాద్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

దీపావళి పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో బాణసంచా విక్రయించే వారు తప్పనిసరిగా మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్‌ఓసి తీసుకోవాలని కమిషనర్ గజానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కొరకు ముందుగా స్థల అనుమతి, దుకాణం సైట్ ప్లాన్‌తో పాటు అగ్నిమాపక, పోలీసు శాఖ నుంచి ఎన్‌ఓసి తీసుకొని మున్సిపల్ కార్యాలయంలో ఎన్‌ఓసి కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా జనావాసాలకు దూరంగా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు.



## పాఠశాలకు స్టీల్ పోడియం బహుకరణ

ఆసిఫాబాద్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు స్టీల్ పోడియం బహుకరించారు. బుధవారం ఆసిఫాబాద్ పట్టణంలోని భారత్ స్టీల్ ఫాబ్రికేటర్ యజమాని కన్నయ్య లాల్, ప్రకాష్‌లు రూ.12000 విలువ గల స్టీల్ పోడియాన్ని పాఠశాలకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు కొడిపాక వేణుగోపాల్, సమితి కార్యదర్శి నాగుల శ్రీనివాస్, పాఠశాల కార్యదర్శి భోగ మధుకర్, సభ్యులు జంజిరాల శ్రీనివాస్, ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## సెల్ సిగ్నల్ సేవలను విస్తరించాలి

### - ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఆసిఫాబాద్, అక్టోబర్ 16 ప్రభాతవార్త



జిల్లాలోని మారుమూల గ్రామాలలో సెల్ సిగ్నల్ సేవలను విస్తరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో భారత్ సంచార నిగం లిమిటెడ్, జియో, ఎయిర్ టెల్ సంస్థల ప్రతినిధులతో సెల్ టవర్ల ఏర్పాటు, సిగ్నల్స్ విస్తరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చాలా గ్రామాలలో పూర్తి స్థాయిలో సెల్ సిగ్నల్ సేవలు అందడం లేదని తెలుపుతూ ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, చేయూత పింఛన్లు, సన్న బియ్యం కార్యక్రమాలు సిగ్నల్స్‌తో ముడిపడి ఉన్నాయని, పూర్తి స్థాయిలో సేవలు అందించేందుకు సిగ్నల్స్ సామర్థ్యాన్ని మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రేట్ పర్యవేక్షకులు శేఖర్, బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్టెల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ టెక్నికల్ అఫీషియల్‌గా సంతోష్

బెల్లంపల్లి, అక్టోబర్ 15, ప్రభాతవార్త



బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్న సల్పాల సంతోష్ యాదవ్ హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 16 నుండి 18 వరకు జరగనున్న 5వ ఇండియన్ ఓపెన్ అండర్ 23 నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు టెక్నికల్ అఫీషియల్‌గా నియమితులైనారు. ఈ విషయాన్ని తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి మంచిర్యాల జిల్లా కార్యదర్శి ఈ. మారయ్య తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు టెక్నికల్ అఫీషియల్‌గా సంతోష్ నియామకం పట్ల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ రవి ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రాజా రమేష్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, బెల్లంపల్లి పట్టణ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.



## రైతు ఆత్మహత్యల గోస పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

### - రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న

బజార్‌హత్నూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని పెడిపల్లి విలాస్ అనే రైతు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఆత్మహత్యకు గల వివరాలు, తాను కౌలుకి తీసుకున్నా భూమిలో వేసిన పంటలకు అయిన ఖర్చుల వివరాలను నమోదు చేసుకోవడం జరిగింది. వాస్తవంగా గత రెండు మూడు సంవత్సరాల నుండి అధిక, అత్యల్ప వర్షపాతలు నమోదు కావడంతో తాను ఆశించినంత పంట దిగుబడి రాలేదని మనోవేదనకు గురై తన ఇంటివద్దనే పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ యొక్క కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిఓ. నంబర్ 194 ప్రకారంగా ఆరు లక్షల రూపాయల పరిహారం ఇచ్చి ఈ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రయత్నం చేయవలసిన అవసరం ఉందని అయన అన్నారు. కుటుంబ యజమానురాలికి నెలకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలి.

గ్రామీణ ప్రాంతాలల్లో వ్యవసాయశాఖ వారు, రెవెన్యూ సిబ్బంది కలిసి రైతు ఆత్మహత్యాలు జరుగకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రతి రైతుకి ఆర్థిక భరోసా కల్పించే విధంగా చిరు ధాన్యలపై, ఆకు కూరగాయల సాగును ప్రోత్సహించే విధంగా, నెలసరి ఆదాయం 15,000 రూపాయలు ఉండే విధంగా ప్రయత్నం చేయవలసిన అవసరం ఉందని ఒక ప్రకటనలో తెలియజేసారు. వారితో చట్ల ఉత్తం, శంకర్, ప్రమోద్ పాటు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ అజీజ్‌కు కలాం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

రామకృష్ణాపూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త



తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్‌కు కలాం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. లీడ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ అవార్డును అందజేశారు. విద్యారంగంలో గత 25 సంవత్సరాలుగా అబ్దుల్ అజీజ్ అందిస్తున్న నిస్వార్థ సేవలు, పేద విద్యార్థులకు అందిస్తున్న ఉచిత విద్యా సహాయం, సామాజిక సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రదానం చేశారు. తవక్కల్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆయనను అభినందించారు.

## పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి

### - జిల్లా పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వర్ రావు

వేమనపల్లి, అక్టోబర్ 15, ప్రభాతవార్త

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వర్ రావు సూచించారు. బుధవారం నీల్వాయి గ్రామపంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ స్టాట్యూటరీ వాటర్ సప్లై రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, గ్రామపంచాయతీ పరిధిలోని రోడ్లు మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఉండకుండా చూసుకోవాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలో జరుగుతున్నటువంటి పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించి సెగ్రిగేషన్ షెడ్‌ని సందర్శించి గ్రామపంచాయతీ నుండి సేకరిస్తున్నటువంటి తడి పొడి చెత్తను వేరు చేయాలని తడి చెత్తతో ఎరువు తయారు చేసి, పొడి చెత్తను రీసైక్లింగ్ యూనిట్‌కు పంపే విధంగా చూడాలని, అదేవిధంగా గ్రామపంచాయతీ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కుమారస్వామి పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.



## ప్రారంభమైన దండారి, గుస్సాడి ఉత్సవాలు

బజార్‌హత్నూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని దండారి నృత్య ఉత్సవాలు ఇటీవలే వివిధ గిరిజన గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. దీపావళి, దసరా పండుగల సందర్భంగా, ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలతో, సంప్రదాయబద్ధమైన డప్పులు, తుడుం వాయిద్యాలతో ఈ వేడుకలు జరుపుకుంటారు. ఈ ఉత్సవాల్లో నెమలి పింఛాలు, జంతు చర్మాలతో తయారుచేసిన దుస్తులు ధరించి, ఆకర్షవంతమైన నృత్యాలు ప్రదర్శించి చూసే ప్రజలను మంత్రముగ్ధులను చేశారు. ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలు, సాంప్రదాయ వాయిద్యాలతో సంబరంగా జరుపుకుంటు,పౌరాణిక కథలను తెలిపే నృత్యాలు చేశారు.దండారి పండుగను తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రత్యేక పండుగగా గుర్తించింది.ఈ నృత్యాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది.



# ఆర్టీఐ జిల్లా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి

## - సమాచార హక్కు రక్షణ చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండగుర్ల కమలాకర్

**ఆసిఫాబాద్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

సమాచార హక్కు చట్టం జిల్లా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని సమాచార హక్కు రక్షణ చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండగుర్ల కమలాకర్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కోరారు. సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీఐ వారోత్సవాలను పునస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమాచార హక్కు చట్టం బలోపేతం కొరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార బోర్డులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని, సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)(బి) ప్రకారం స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారంను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. దరఖాస్తుదారులకు చట్ట ప్రకారం గడువులోపు సమాచారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సమాచార హక్కు చట్టం అమలు, బలోపేతం, సమాచార బోర్డుల ఏర్పాటులో గ్రామస్థాయి వరకు ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షులు కబీర్, జిల్లా



ప్రధాన కార్యదర్శి వంగారి ప్రవీణ్, జిల్లా సలహాదారులు రామ్టెంకి కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జాడి ప్రవీణ్, జిల్లా ప్రచార కార్యదర్శి, శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు జాడి రవిదాస్, జిల్లా కమిటీ సభ్యులు ఐటమ్ కిరణ్, డివిజన్ కమిటీ సభ్యులు సురేష్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## మద్యం దుకాణాల టెండర్లకు మరో మూడు రోజులు

**ఆసిఫాబాద్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

జిల్లాలో నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు చేపట్టిన టెండర్లకు మరో మూడు రోజులు మాత్రమే గడువుందని జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ బుధవారం పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా కొనసాగుతోందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబరు 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిన్నట్లు తెలిపారు. 15వ తేదీ వరకు తేదీ వరకు కొమరం భీం జిల్లా వ్యాప్తంగా 32 మద్యం దుకాణలకు గాను 166 మంది దరఖాస్తులు చేసున్నట్లు తెలిపారు. మద్యం దుకాణాల దరఖాస్తులకు ఈనెల 18వ తేదీ వరకు ప్రభుత్వం గడువు విధించిందని, ఈ నేపథ్యంలో వచ్చే మూడు రోజులు టెండర్లకు చాలా కీలకమని, మరో 800 దరఖాస్తులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. షాప్ నం 1-ఖ6 దరఖాస్తులు వచ్చాయని, అదేవిధంగా 2-7, 3-7, 4-3, 5-8, 6-3, 7-25, 8-21, 11-1, 12-16, 13-22, 16-2, 17-4, 18-1, 19-1, 21-2, 24-1, 25-8, 27-13, 28-14, 31-1 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్కారీ శాఖ అధికారులు రమేష్ కుమార్, సిబ్బంది ఉన్నారు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

**పెంచికల్‌పేట్,అక్టోబర్ 15,ప్రభాతవార్త**



వాహనదారులు ప్రయాణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పెంచికల్ పేట్ ఎస్సై అనిల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాలపై ముగ్గురు ప్రయాణించడం, అధిక వేగం, ఇతర ప్రాణులకు ముప్పు కలిగే విధంగా వాహనాలు నడిపితే రుసుముతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోలు, ట్రాక్టర్లు, బోలెరోలు తదితర వాహనదారులు లైసెన్స్, పొల్యూషన్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుండా పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## మహిళలే గ్రామీణ అభివృద్ధికి ఆధారం

### - రాజలింగు మోతే

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

గ్రామీణ సమాజ అభివృద్ధిలో మహిళల కృషిని ప్రభుత్వాలు గుర్తించాలని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతే అన్నారు. బుధవారం అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి తగిన గుర్తింపు లభించడం లేదని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, ఆస్తి హక్కులు, పేదరికం, లైంగిక వివక్ష వంటి సమస్యలతో వారు ఇంకా సతమతమవుతున్నారని అన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి పని చేయాలని సూచించారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు

**సారంగాపూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

నవంబర్ 14 వరకు మండలంలో ఉన్న అన్ని గ్రామాల పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయడం జరుగుతుందని డాక్టర్ నందకుమార్ తెలిపారు. బుధవారం కౌట్ల (బి) గ్రామంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నందకుమార్ మాట్లాడుతు పశువులకు ఈ వ్యాధి వైరల్ డిసీస్ ద్వారా,గడ్డి, నీరు, వాతావరణంలో వచ్చిన మార్పుల ద్వారా పశువులకు సోకుతుంది. ఈ వ్యాధి వచ్చిన పశువులు నోటి నుండి సొల్లు గారడం,నాలుగు కాళ్ల డెక్కలలో పుండ్లు అవడం జరుగుతుంది. అదేవిధంగా పాలు ఇచ్చే ఆవులు, గేదెలు,సరిగా పాలు ఇవ్వవు పని చేసే ఎద్దులు అలసిపోతాయి పనిచేయలేవు అందుకే ముందస్తుగా వ్యాధి సోగకుండా పశువుల టీకాలు వేయడం జరుగుతుంది.ప్రభుత్వం పశుపోషణ ను పెంపొదిం చే భాగంలో నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు 15 నుంచి 20 రోజులు వైద్యం తప్పకుండా అందించాలి అప్పుడే అవి మెరుగవుతాయి అని తెలిపినాడు ఈ కార్యక్రమం సిబ్బంది దిలీప్, రాజేందర్, పోతన్న,రైతులు తదితరులు పాల్గొన్నారు.





## బ్యాడ్జిల ఆవిష్కరణ

**బోథ్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

బోథ్ మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ బ్యాడ్జీలను ఎంపీడీవో ఎల్ రమేష్ ఎఫ్ఆర్ఓ టి ప్రణయ్ హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ నార్త్ తెలంగాణ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట్ ఈడిఐఐ కోఆర్డినేటర్ దేవేందర్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడైన శేఖరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ఈ ప్రాంతం ఎన్నో ఎంతో విలువైన అటవీ సంపదను కలిగి ఉందని దానిని కాపాడవలసిన బాధ్యత సొసైటీతో పాటుగా ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా నీటి వనరులు వృధాగా చేయనీయకుండా గ్రామాలలో అవగాహన సదస్సులను ఈ సొసైటీ ద్వారా కల్పించాలని కోరారు. అలాగే ఈ సమస్త ఇంకా మరింత ఉన్నత స్థానానికి చేరుకొని ఎన్నో అవార్డులను పొందాలని ఆకాంక్షించారు. ప్రకృతి పర్యావరణపరంగా ప్రతి ఒక్కరిని కాపాడుటలో భాగస్వాములు చేయుటలో విజయవంతం అవ్వాలని తెలిపారు. సమాజంలోని పలు సమస్యల పరిష్కారంతోపాటుగా అన్ని రంగాల పరంగా అభివృద్ధి వైపు ప్రతి ఒక్కరిని నడిపించేలా మార్గదర్శకం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అతుల్ కుమార్, దాసరి పురుషోత్తం, అబ్దుల్ రావుఫ్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సాంగ్విని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి

**దిలావర్పూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ బుధవారం దిలావర్పూర్ మండలంలోని సాంగ్వి పంచాయతీలోని పలు రికార్డులను పలు రికార్డులను పరిశీలించారు. ఈ నేపథ్యంలో శానిటైజేషన్ పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించాలని తెలిపారు. ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లిన చెత్తను డంపింగ్ యార్డ్ లో తడి పొడి చెత్తను వెయ్యాలని కంపోస్టు ఎరువును పీపీవీ ఎవన్యూ ప్లానిటేషన్‌లోని మొక్కలకు వేయాలని క్రిమిటోరియం చుట్టు మొక్కలు నాటించాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను అంగన్వాడీ కేంద్రాన్ని నర్సరీని పరిశీలించారు. ఎంపీవో గోవర్ధన్ పంచాయతీ కార్యదర్శి ఆకాష్ తదితరులు ఉన్నారు.

## మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**సారంగాపూర్, అక్టోబర్15, ప్రభాతవార్త**

జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నారు. మొత్తం 5. అవి 4 బాలిక పాఠశాలలు, 1 బాలుర పాఠశాల. 2025-26 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతిలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది. సారంగాపూర్‌లోని జాం సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఈనెల 17వ తారీకు 9.30ల నుండి సాయంత్రం 4.30 వరకు. విద్యార్థులు తమ వెంట ఒరిజినల్ హాల్ టికెట్, ఫోటో, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికేట్ తీసుకొని వచ్చి అప్లై చేయగలరు. తాము తీసుకున్న అప్లికేషన్ సరిచూసి మెరిట్ లిస్టును పెట్టడం జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

# అధికారులతో సమీక్ష సమావేశం

**వేమనపల్లి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

బుధవారం రోజున ఎంపిడివో కార్యాలయంలో ఎంపీడీవో కుమారస్వామి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశానికి జిల్లా పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఇట్టి సమావేశంలో డిపివో మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలందరికి ఈకేవైసి పూర్తి చేయాలని, ప్రతి గ్రామపంచాయతీలలో నర్సరీ బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి స్థాయిలో చేయాలని, ప్లాంటేషన్ పనులు పూర్తి చేసి 100 శాతం మొక్కలు సర్వైవల్ ఉండే విధంగా చూడాలని, గ్రామ సభలు పూర్తి అయిన సాంకేతిక సహాయకులు కొత్త పనులను ఎంపిక చేయాలని సూచించడం జరిగింది. అలాగే టాక్స్ కలెక్షన్, పారిశుద్ధంపైన ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామపంచాయతీ రికార్డుల నిర్వహణ పూర్తిస్థాయిలో ఉండేలా చూసుకోవాలని ఎంపీడీవోకు క్షేత్రస్థాయి సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. ఇట్టి సమావేశానికి ఏపీవో మహేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.





# కోసినిలో గాలికుంటు నివారణ టీకా పంపిణి కార్యక్రమం

**కాగజ్‌నగర్ రూరల్ ,అక్టోబర్ 15,ప్రభాతవార్త**

పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించే పశువులకు గాలికుంటు నివారణ టీకా పంపిణి కార్యక్రమంలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలో నిర్వహించినట్లు కాగజ్‌నగర్ పశువైద్యాధికారి డాక్టర్ వడ్లూరి పరిమళ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ఉప సర్పంచ్ నగునూరి శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామంలోని పశువులు, ఎద్దులు, ఆవులు, గేదెలు, దూడలకు వ్యాధి నివారణ టీకా పంపిణి చేయడం జరిగిందని తెలిపారు. 1325 పశువులు, 390 గేదులకు మొత్తం 1615 పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ విడుదల వారిగా మండలంలోని ఆయా గ్రామాల్లో వ్యాధి నివారణ టీకా పంపిణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పశుపోషకులు తప్పకుండా పశువులకు టీకా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నగునూరి శ్రీనివాస్, ఎల్ఎస్ఎ శైలేందర్, విఎలు అమన్, సునిల్, ఓఎస్ శ్రీను, గోపాల మిత్రలు దేటి రమేష్‌బాబు, జమీర్, వంశీ, పశుపోషకులు, తదితరులు పాల్గొన్నారు.

# శుభ్రత, పారదర్శకత, సమయ పాలన, సమర్ధవంతమైన కార్యనిర్వహణ ముఖ్యం: జీఎం

**జైపూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**




ఉద్యోగులకు, అధికారులకు శుభ్రత, పారదర్శకత, సమయపాలన, సమర్ధవంతమైన కార్యనిర్వహణ ముఖ్యమని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపిపి) జీఎం నరసింహ రావు అన్నారు. అన్ని ప్రభుత్వరంగ సంస్థలలో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమాన్ని అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 31 వరకు నిర్వహించాలని కోల్ మినిస్ట్రీ ఆదేశాలు జారీ చేయగా బుధవారం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో నిర్వహించగా జీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం నరసింహారావు మాట్లాడుతూ, కార్యాలయ పరిసరాలు శుభ్రంగా ఉంచడం, పని ఫైళ్లను సమయానికి నిర్వహించడం, పెండింగ్ పనులను తక్షణమే పరిష్కరించడం, ఉద్యోగి పౌరులకు సౌకర్యవంతమైన పారదర్శక సేవలు అందించడం ద్వారా ప్రతి ఉద్యోగి స్పెషల్ క్యాంపెయిన్ 5.0 విజయానికి కృషి చేయాలని కోరారు. గాంధీజీ కలలు కన్న భారతదేశాన్ని తయారు చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన దేశంగా కావాలని, స్వచ్ఛభారత్ సాధించే లక్ష్యంతో ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు తాత్కాలిక స్కూల్ ప్రతిపాదిత భవనం, వాటి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పిట్ సెక్రటరీ సిహెచ్ సత్యనారాయణ, సోలార్ ఏ.జి.ఎం శ్రీనివాస్, సివిల్ డి.జి.ఎం ఆజాజుల్లా ఖాన్, ఈ అండ్ ఎం డీ.జీ.ఎం. పంతులా, పర్సనల్ డీ.జి.ఎం కిరణ్ బాబు, వాటర్ సిస్టమ్స్ డీ.జి.ఎం శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ డీ.జి.ఎం వాసుదేవ మూర్తి, యాష్ డీజీఎం స్వామిరాజు,ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి, సేఫ్టీ ఆఫీసర్ పులి సురేష్ ఇతర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**- డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్**

**కాగజ్‌నగర్ రూరల్,అక్టోబర్ 15,ప్రభాతవార్త**

కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కొత్తపల్లి వెంకటలక్ష్మి- చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వారి ఆధర్వంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షలో ఎంపికైన క్యటరక్ట్ పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణా, భోజనం సదుపాయం కల్పించి 14మందికి ఆపరేషన్ కోసం బుధవారం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు ఈ సందర్భంగా డా.కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలలో వేల మందికి ఆపరేషన్ చేయించామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆపరేషన్ చేయించికొని లబ్ధి పొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపి కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి పురోభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలి

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను సకాలంలో పూర్తి చేసి, సింగరేణి పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విధులలో ప్రతిభ కనబర్చిన శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ డిపార్ట్మెంట్ ఉద్యోగి చొప్పదండి స్వామికి జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదవి విరమణ నాడే మెడికల్ కార్డును అందచేయాలని సంస్థ డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు ఆదేశించినట్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఈ నెల 31న పదవీ విరమణ పొందుతున్న ఆరుగురు ఉద్యోగులకు మెడికల్ కార్డులను అందజేయడానికి అవసరమైన ప్రక్రియను ముందస్తుగా పూర్తి చేసిన పర్సనల్ డిపార్ట్మెంట్ ఉద్యోగి చొప్పదండి స్వామిని జీఎం అభినందించారు. చొప్పదండి స్వామిని ఆదర్శంగా తీసుకొని ఉద్యోగులందరూ తమ విధులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, డీజిఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, టింబర్ యార్డ్ ఇన్చార్జ్ రాజేశ్వర్, డివైపీఎంలు రాజేష్, కిరణ్ కుమార్, సీనియర్ పీవోలు పి. కాంతారావు, మురళి, సురేందర్, పర్సనల్ విభాగం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.